చిత్రావతిపై.. ప్రయాణం ఇక సాఫీ

- రూ.1.95 కోట్లతో పూర్తయిన బ్రిడ్జి నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న ఎంపీ రంగయ్య, ఆలూరు సాంబశివారెడ్డి
- సంతోషంలో ప్రజలు



చిత్రావతి నదిపై ప్రారంభానికి సిద్ధమైన బ్రిడ్జి

యల్లనూరు: మండలంలోని చిత్రావతి నదిపై ప్రయాణం ఇక సాఫీగా సాగనుంది. వర్షాకాలంలో నది ఉధృతంగా ప్రవహిస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోయేవి. అయితే ఇక నుంచి ఆ ఇబ్బందులు ఉండవు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి చొరవతో చిత్రావతి నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. శనివారం ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య బ్రిడ్జిని ప్రారంభించనున్నారు.

చిత్రావతి నదిపై ఇబ్బందులు

ఆరు నెలల కిందట పార్నపల్లి రిజర్వాయరులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో దిగువ ప్రాంతంలోని చిత్రావతి నదికి నీటిని విడుదల చేశారు. నీటి ప్రవాహంతో చిత్రావతి నది పరవళ్లు తొక్కి రాకపోకలకు నెలరోజులు అంతరాయం కల్గింది. యల్లనూరు, వెన్నపూసపల్లి, పాతపల్లి, జంగంపల్లి, కృష్ణాపురం తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే తిరుమలాపురం, పెద్దమల్లేపల్లి, నిట్టూరు, మేడికుర్తి, వాసాపురం, కోడిమూర్తి, చిలమకూరు తదితర గ్రామాల ప్రజలు యల్లనూరు మండల కేంద్రానికి రాలేకపోయారు. రోడ్లు పూర్తిగా దెబ్బతిని నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. రైతులు పండించిన పంటలను ఇంటికి తీసుకురాలేని పరిస్థితి ఉత్పన్నమైంది. ఎన్నో ఏళ్లుగా ప్రజలు చిత్రావతి నదిలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు.

ఎమ్మెల్యే, ప్రభుత్వ విద్య సలహాదారు చొరవ..

యల్లనూరు చిత్రావతి నదితో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యాసలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఎలాగైనా సమస్య పరిష్కరించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ 26న నార్పలకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో వెంటనే ముఖ్యమంత్రి బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.95 కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు చిత్రావతి నదిపై దాదాపు 69 మీటర్ల పొడవు, 7 మీటర్ల వెడల్పుతో బ్రిడ్జి నిర్మాణం పూర్తియింది. బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో మండల ప్రజలు సీఎంతోపాటు ఎమ్మెల్యే ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి కతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ఎన్నో ఏళ్ల సమస్య తీరింది



ఎన్నో ఏళ్లుగా బ్రిడ్జి లేక చాలా అవస్థలు పడ్డాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్నో ఏళ్ల కష్టాలు తీరాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకొని చిత్రావతి నదిలో బ్రిడ్జి ఏర్పాటు చేయడం ఆనందకరం. మా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి రుణపడి ఉంటాం.

\- జాఫర్, యల్లనూరు

బ్రిడ్జి నిర్మాణం సంతోషదాయకం



పార్నపల్లి రిజర్వాయరులో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తే చిత్రావతి నది పరవళ్లు తొక్కుతుంది. దీంతో యల్లనూరు పరిసర ప్రాంతాల ప్రజల రాకపోకలు ఆగిపోతాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మా సమస్యను అర్థం చేసుకుంది. బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

\- చిన్న ఓబులేసు, యల్లనూరు

ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైకేపీ ఉద్యోగులు, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: ఉద్యోగుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సెర్ప్(వైఎస్సార్ క్రాంతి పథం) ఉద్యోగులకు పీఆర్‌సీ ద్వారా 23 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని తెలిపారు. ఉద్యోగులకు ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. సెర్ప్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అనంతరం ఉద్యోగులు ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారును శాలువాతో సన్మానించారు. శింగనమల నియోజకవర్గంలోని ఏపీఎంలు, వైకేపీ సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షం

- ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి



కోనేపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి

పామిడి: ముఖ్యమంత్రి జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం పాళ్యంతండా, కోనేపల్లి, కోనేపల్లి తండాలో గ్రామ సర్పంచ్ వెంకటేష్‌నాయక్, ఎంపీటీసీ లీలాబాయి, నాయకులు కృష్ణానాయక్, నారాయణస్వామి, శీనా, హనుమప్ప, దేవేంద్ర, రవినాయక్, రాకేష్‌నాయక్, గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చేపట్టారు. వారికి ఆయా గ్రామాల్లో ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. స్థానికులు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయా గ్రామాల్లోని మూడు పేద కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిసాయం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ అర్హతే ప్రామాణికంగా కులం, మతం, పార్టీ అన్న బేధం లేకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా పాలన సాగిస్తున్నారన్నారు. అధికారం కోసం సూపర్‌సిక్స్ వంటి మోసపూరిత హామీలు ఇస్తున్న చంద్రబాబును, సినీ డైలాగ్‌లతో మాటల గారడి చేస్తున్న పవన్ ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం సాధించిన ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ సీబీ జానకిరామిరెడ్డి, మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, ఓసీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మెత లక్ష్మి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కుమ్మెత చెన్నకేశవరెడ్డి, జోజోడే కుమార్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పామిడి: జీ కొట్టాల, కాలాపురం గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పామిడి: ఆత్మహత్యకు యత్నించిన ఎద్దులపల్లి వాసి శుక్రవారం మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో గ్రామానికి చెందిన సుంకన్న(57) పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించండతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కొండక్క, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమతిలేని మందులను విక్రయిస్తే చర్యలు

గుంతకల్లు రూరల్: ఫర్టిలైజర్ షాపుల్లో అనుమతిలేని ఎరువులు, క్రిమిసంహారక మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ స్వాతి హెచ్చరించారు. శుక్రవారం ఆమె తన సిబ్బందితో కలిసి పట్టణంలోని అన్నదాత, శ్రావణి ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయా షాపుల్లో స్టాకు రిజిష్టర్లు, బిల్‌బుక్స్ పరిశీలించిన వారి లైసెన్స్‌లను తనిఖీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పామిడి: ఆత్మహత్యకు యత్నించిన ఎద్దులపల్లి వాసి శుక్రవారం మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో గ్రామానికి చెందిన సుంకన్న(57) పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించండతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కొండక్క, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తులతో మర్యాదగా నడుచుకోవాలి

గుంతకల్లు రూరల్: భక్తులతో ఆటో డ్రైవర్లు, ప్రైవేటు లాడ్జిల నిర్వాహకులు మర్యాదగా నడుచుకోవాలని రూరల్ సీఐ ఉమామహేశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం కసాపురం దేవస్థానం సమీపంలోని ఔట్‌పోస్టు వద్ద కసాపురం ఎస్ఐ గోపాలుడుతో కలిసి రూరల్ సీఐ ఆటో డ్రైవర్లు, ప్రైవేటు అద్దె గదుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆటోల్లో ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించరాదని, మహిళల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. లాడ్జిలకు వచ్చే వారితో పూర్తి వివరాలు తీసుకోవాలని, ఎక్కువ మొత్తంలో డబ్బు వసూలు చేయకూడదని సూచించారు.

మద్యం విక్రేత అరెస్టు

గుత్తి రూరల్: ఊబిచెర్ల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న శ్రీనివాసులు అనే వ్యక్తిని శుక్రవారం సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ ఎస్ఐ ఆలీ అహ్మద్ తెలిపారు.

యాడికి: మండలకేంద్రంలో చికెన్ సెంటర్ నిర్వాహకుడు మహబూబ్‌బాషా మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి ఆనందకుమార్‌శర్మ మహిళలతో పూజలు చేయించారు. శ్రావణ మాసంలో మిగిలిన మూడు శుక్రవారాలు అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహిస్తామని అర్చకుడు తెలిపారు.

జగనన్న కాలనీల్లో సదుపాయాలు కల్పిస్తాం



ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న అధికారులు

బుక్కరాయసముద్రం: జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హౌసింగ్ ఈఈ కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జగనన్నకాలనీలో ఈఈ, జెడ్పీటీసీ భాస్కర్ ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. ముందుగా గ్రామంలో ఎన్ని లే అవుట్లు ఉన్నాయి, ఎంత మందికి ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరయ్యాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలో త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ విజయభాస్కర్, డీఈ శ్రీమన్నారాయణ, హౌసింగ్ ఏఈ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు పొందిన ఎంపీడీఓ విజయభాస్కర్, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డిని జెడ్పీటీసీ భాస్కర్ శుక్రవారం సన్మానించారు. వైఎస్సార్ సీపీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి చేపల రమణ, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, నాయకులు చిన్నపరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కొండన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వైవీఆర్‌కు సన్మానం



ఎమ్మెల్యే వైవీఆర్‌ను సన్మానిస్తున్న అంజుమన్ కమిటీ పెద్దలు

గుంతకల్లుటౌన్: ప్రభుత్వం పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని అంజుమన్ ఇస్లామియా కమిటీ పెద్దలు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఎమ్మెల్యేను ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ప్రభుత్వ అరబిక్ ఉర్దూ జూనియర్ కళాశాలను ప్రారంభింపజేయాలని, అప్పటివరకు అరబిక్ స్కూల్‌ను కాలేజీ భవనంలోకి మార్పించాలని కమిటీ పెద్దలు కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కమిటీ పెద్దలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్, ఉపాధ్యక్షుడు బాసిద్‌బాషా, సభ్యులు ఆర్‌డీ జీ.బాషా, వలిబాషా, హాజీజలీల్, అఫ్రోజ్, అష్రఫ్, తదితర మసీదు కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: జీ.కొట్టాల గ్రామంలో ఎస్సీల శ్మశానవాటిక స్థల వివాదాన్ని పరిష్కరించాలని గ్రామ ఎస్సీలు శుక్రవారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డిని కోరారు. వందేళ్లుగా తాము అదే శ్మశానవాటికలో మృతదేహాలను ఖననం చేస్తూ వస్తున్నామన్నారు. కానీ ఇటీవల కొంతమంది ప్రైవేటు వ్యక్తులు శ్మశాన వాటిక స్థలం తమదంటూ దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

గుంతకల్లు: స్థానిక పాత బస్టాండ్ శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, చిరంజీవి మట్లాడుతూ విద్యారంగం సమస్యలపై ఐక్య పోరాటాలు చేస్తామన్నారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్.వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా అఖిల్, కుమార్, శివమణీ, చిన్న. విజయ్, సహాయ కార్యదర్శులుగా చిన్న నారాయణస్వామి, సైలాస్, ఉపేంద్ర, రాజాను ఎన్నుకున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కారం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా 3వ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఉద్యోగులు, కార్మికుల నుంచి వినతులను స్వీకరించి తమ పరిధిలో ఉన్న సమస్యలను నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఆర్‌ఓ నాసిర్‌హుసేన్, ఏఓ రవిచంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

వార్డు ఎన్నికలకు పటిష్ట బందోబస్తు



జి.వెంకటాంపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సీఎం గంగయ్య



బూదేడు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ

యాడికి: యాడికి ఉన్నత పాఠశాల 2, రాయలచెరువులోని ప్రాథమిక పాఠశాలలో ఒక పోలింగ్ బూత్‌లలో జరిగే వార్డు ఉప ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ గంగయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు, రాయలచెరువులోని పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు, 50 మంది పోలీసులతో బందోబస్తు ఉంటుందన్నారు. పోలింగ్ బూత్‌లోకి ఓటరు ఐడీ కార్డు తప్ప ఏవీ తీసుకురాకూడదన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 114 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. బందోబస్తు నిమిత్తం వచ్చిన పోలింగ్ సిబ్బందితో ఆయన మాట్లాడారు. సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐలు గురుప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

పెద్దవడుగూరు : జి.వెంకటాంపల్లి గ్రామంలో 4వ వార్డు ఉప ఎన్నిక శనివారం ప్రశాంతం గా నిర్వహించాలని డీఎస్పీ సీఎం గంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జి.వెంకటాంపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని హెచ్చరించారు.

యల్లనూరు: జంగంపల్లి సర్పంచు స్థానం, బొప్పేపల్లి 3వ వార్డు ఉప ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆనంద్‌ప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ఉంటుందన్నారు.

గార్లదిన్నె: బూదేడు 9వ వార్డు మెంబర్ ఉప ఎన్నిక పకడ్బందీగా నిర్వహించాలని సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం బూదేడు ప్రాథమి కోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ సమయంలో ఎలాంటి సంఘటనలు జరుగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

గుత్తి రూరల్: ధర్మాపురం, లచ్చానుపల్లి గ్రామాల్లో శనివారం జరగనున్న వార్డు సభ్యుల ఉప ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ రవీంద్ర ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్, స్టేజ్-2, పీఓ, ఏపీఓలతో ఆర్డీఓ రవీంద్ర ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రెండు పంచాయతీలలో వార్డు సభ్యుల ఉప ఎన్నికను ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాలన్నారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ పత్రాలను తెరచి పోలింగ్ ప్రక్రియను జరిగేలా చూడాలన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివాజీ రెడ్డి, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంఈఓ రవినాయక్, రిటర్నింగ్ అధికారులు శశికళ, బారన్‌సాబ్, కార్యదర్శులు ధనలక్ష్మి, ప్రవీణ్ పాల్గొన్నారు.

పుట్లూరు: ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఓటర్ స్లిప్‌తో పాటు ఫొటో గుర్తింపు కార్డును తీసుకురావాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన చెర్లోపల్లిలోని ఆర్డీటీ పాఠశాల వద్ద ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభుత్వం జారీ చేసిన 18 రకాల గుర్తుఇంపు కార్డులలో ఏదైనా ఒకటి తీసుకుని రావాలన్నారు.

క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



గుత్తి చెరువును పరిశీలిస్తున్న నాయకులు, ఇరిగేషన్ అధికారులు

గుత్తి: మండల వ్యాప్తంగా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇరిగేషన్ అధికారులు తెలిపారు. త్వరలోనే గుంతకల్లు మండలం వైటీచెరువు నుంచి హంద్రీ- నీవా జలాలను గుత్తి చెరువుకు వదలనున్న నేపథ్యంలో గుత్తి చెరువు, కాలువలు, తూములను ఇరిగేషన్ అధికారులు, సీనియర్ నేత శ్రీనివాస రెడ్డి, పట్టణ కన్వీనర్ పీరా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లయ్య తదితరులను పరిశీలించారు. కౌన్సిలర్లు వరదరాజులు, నజీర్, ఫరూక్,వాలీ్మకి శివ, గురు ప్రసాద్ యాదవ్, బేడల వెంకటరాముడు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే గృహ రుణాలు



మాట్లాడుతున్న ఆర్ఎం శ్రీదేవి

గుంతకల్లుటౌన్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఇతర వాణిజ్య బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే గృహ, కారు, ట్రాక్టర్, వృత్తి, వ్యాపారపరమైన రుణాలను అందజేస్తామని బ్యాంకు రీజనల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఆమె మండీబజార్‌లోని బ్యాంక్‌ను సందర్శించి అనంతరం విలేకర్లతో మాట్లాడారు. తమ రీజనల్ పరిధిలోని 65 శాఖల ద్వారా రూ.2,787 కోట్ల డిపాజిట్లను సేకరించడమే కాకుండా రూ.3,020 కోట్ల రుణాలను మంజూరు చేశామన్నారు. డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ఖాతాదారులకు అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం ఖాతాదారులతో బ్యాంకు సేవలపై ఆరాతీశారు. బ్యాంక్ మేనేజర్ భానుతేజ, ఫీల్డ్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

తాడిపత్రి: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కడప రోడ్డు, యల్లనూర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ మేరకు ఏఈ వీరాంజనేయులు ఓ ప్రకటన విడుదల చేశారు.

నేడు పెట్రోల్ బంకు ప్రారంభం

యల్లనూరు: మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనం ఎదురుగా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంకు, చిలమకూరు వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి భూమిపూజ చేయనున్నారు. ఈమేరకు జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కిరణ్, సీఈఓ వీరనారప్ప తెలిపారు.

నీటి పంపింగ్ ఏర్పాట్లు చేయండి



కెనాల్ వద్ద పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: హంద్రీ-నీవా కెనాల్‌కు అతిత్వరలో విడుదల కానున్న నీటిని సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుల్లో పంపింగ్‌కు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఇంజినీరింగ్, వాటర్‌వర్క్స్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కెనాల్‌తో పాటు పంప్‌హౌస్‌లను పరిశీలించారు. విద్యుత్ మోటార్లు, పైప్‌లైన్ల మరమ్మతులేవైనా ఉంటే చేయించుకోవాలని చెప్పారు. నీటి పంపింగ్ సమయంలో ఇబ్బందుల్లేకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. మాజీ చైర్మన్ రామలింగప్ప, ఏఈ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

జేసీబీ పట్టివేత

పామిడి: కోనేపల్లి అటవీప్రాంతంలో అనుమతి లేకుండా గుంతలు తవ్వుతున్న జేసీబీని అటవీ అధికారులు పట్టుకున్నారు. కోనేపల్లి అటవీ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వుతుండగా జేసీబీ డ్రైవర్‌ను వలిని పట్టుకున్నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కరీముల్లా తెలిపారు. జేసీబీని పామిడి ఫారెస్ట్ ఆఫీస్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

ప్రజలను తిప్పకోవద్దు



మద్దిపల్లి సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ యోగానందరెడ్డి

పుట్లూరు: ప్రజలను కార్యాలయాల చుట్టూ తప్పకుండా వీలైనంత త్వరగతిన సేవలను అందించాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన ఎల్లుట్ల, మద్దిపల్లి గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామ సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు.

వందే భారత్ గుత్తి జంక్షన్ మీదుగా నడపాలి

గుత్తి: వందే భారత్ రైలును గుత్తి జంక్షన్ మీదగా నడపాలని గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయ భాస్కర్, యువజన నాయకులు చిరంజీవి, దేవేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం గుత్తి కోట సంరక్షణ సమితి నాయకులు విలేకరులతో మాట్లాడుతూ రైల్వే జోనల్ అధికారులు వందే భారత్ రైలును గుత్తి, ద్రోణాచలం మీదగా నడపాలని భావిస్తుండగా కాని అందుకు విరుద్ధంగా రైల్వే డివిజన్ అధికారులు ఆలోచిస్తున్నారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వందే భారత్ రైలును గుత్తి జంక్షన్ మీదగా నడపాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సత్యదేవుని జయంతి



అలంకరణలో లక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి

తాడిపత్రి: స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలోని మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానంఏర్పాటు చేశారు.

పోస్టర్ల విడుదల

పామిడి: జిల్లాలో 23 నుంచి 30వ తేదీ వరకూ విద్యారంగ సమస్యలపై సైకిల్ యాత్ర చేపట్టనున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ తెలిపారు. ఈమేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం సైకిల్ యాత్ర పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు, నరేష్, చందు, సతీష్, నాగార్జున, షెక్షావలి పాల్గొన్నారు.